బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 18 ఆగస్టు-2026 balagamtv100@gmail.com పేజీలు-8


# దర్యాప్తు త్వరగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు రావాలి

**రెండు వారాల్లో సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్టు సమర్పించాలి**

**అయోధ్య రామమందిర విరాళాల కేసులో సిట్‌కు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**



బలగం టీవీ, హైదరాబాద్

అయోధ్య రామమందిర విరాళాల చోరీ, దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు రావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై రెండు వారాల్లోగా సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్టును దాఖలు చేయాలని ఆదేశించింది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఈ కేసును విచారించింది. మిగితా 2వ పేజీలో

## ఏడాదిన్నరలో

# నాలుగు ఆసుపత్రులు పూర్తి చేస్తాం

**ప్రతి ఆరు నెలలకు ఒక ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం**

**ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి**

**సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభం**





బలగం టీవీ, హైదరాబాద్

రాబోయే ఏడాదిన్నర కాలంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, అల్వాల్ టిమ్స్, ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఏ కార్పొరేట్ ఆసుపత్రికి తీసిపోని విధంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

**10 వేల పడకలు అందుబాటులోకి**

అనంతరం ఆసుపత్రి ఆవరణలో జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. ఉస్మానియా, సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ ఆసుపత్రులన్నీ పూర్తయితే రాష్ట్రంలో సుమారు10 వేల పడకలు పేదలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

నిమ్స్ ఆసుపత్రికి ధీటుగా ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి వారి పర్యవేక్షణలో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు నిర్వహణలోనూ కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రోగులకు ఉచిత భోజనం.. అటెండెంట్లకు వసతి**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఉచితంగా భోజనం అందించాలని సీఎం సూచించారు. రోగుల వెంట వచ్చే అటెండెంట్ల కోసం డార్మెటరీలు, ఇతర వసతులు కల్పించాలని అన్నారు. ఆసుపత్రులతోపాటు సూపర్ పీజీ, నర్సింగ్ కళాశాలలను కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**వైద్య రంగంలో 16 వేల నియామకాలు**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్య రంగంలో ఇప్పటివరకు 16 వేల మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్దఎత్తున నియామకాలు జరగలేదన్నారు.

పేదల ఆరోగ్యాన్ని ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని, విద్య, వైద్యానికి కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా భవిష్యత్ కోసం పెట్టుబడిగా చూస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాల్లో పిల్లల చదువులు, తల్లిదండ్రుల వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారాయని అన్నారు.

**ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.5,226 కోట్లు**

32 నెలల ప్రజా పాలనలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కోసం దాదాపు రూ.2,700 కోట్లు ఖర్చు చేశామని సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,526 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ రెండు పథకాల ద్వారా మొత్తం రూ.5,226 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఖర్చు చేశామని వెల్లడించారు. మిగితా 2వ పేజీలో



# సర్' ముసాయిదా జాబితా విడుదల

**92,87,577 మందిఓటర్లకు నోటీసులు**

**అనామలిస్ కేటగిరి ఓటర్లు 60,50,918**

**2002 సర్‌తో మ్యాపింగ్ కాని వారు 32,36,659**

**తొలగించిన ఓట్లు 73,39,235**

**నోటీసులందిన వారు నిర్దేశించిన 11 ఆధారాలు సమర్పించాలి**

**కొత్త ఓటర్లు, ఓటు కోల్పోయిన వారు ఫాం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

**సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాల స్వీకరణ**

**అక్టోబర్ 15 లోగా ఫిర్యాదుల పరిష్కారం**

**వివరాలు వెల్లడించిన సీఈఓ సుదర్శన్‌రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముసాయిదాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. నిర్దేశిత గడువు ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్నికల సంఘానికి అందజేసిన 2,64,87,213 మంది ఓటర్లను ముసాయిదా జాబితాలో చేర్చినట్లు తెలిపారు. పూర్తి జాబితాను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో 78.30 శాతం మంది మాత్రమే డ్రాఫ్ట్ లిస్టులో ఉన్నారని వివరించారు. ఇందులో 60,50,918 మంది ఓటర్లు అనామలిస్ కేటగిరిలో, 2002 సర్‌తో మ్యాపింగ్ కాని వారు 32,36,659 మంది, మొత్తం 92,87,577 మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. 119 మంది ఎలక్షన్ రిటర్నింగ్ అదికారులు(ఈఆర్ఓ), 890 మంది అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అదికారి(ఏఈఆర్ఓ)లు బీఎల్ఓల ద్వారా వీరికి నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో ఈసీఐ ఫార్మట్‌లో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ కార్డులు, జన్మ ధృవీకరణ పత్రం, పాస్ పోర్ట్, టెన్త్ సర్టిఫికెట్, అటవీ హక్కుల ధృవీకరణ పత్రం, భూమి/ఇంటి కేటాయింపు మొదలగు 11 డ్యాక్యుమెంట్లను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఓటు తొలగింపుపై వచ్చిన అభ్యంతరాలను ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ సర్కార్ కొత్తగా జారీ చేసిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని స్పష్టం చేశారు. ఈఆర్ఓ, ఏఈఆర్ఓల సంఖ్యను మరో 500 మందిని పెంచాలని ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. గడువు పెంపు, సిబ్బంది పెంపుపై తుది నిర్ణయం ఈసీఐదేనని స్పష్టం చేశారు. తెలంగాణలో మాత్రమే భారీ సంఖ్యలో ఓట్లను తొలగించారనే ఆరోపణలను ఆయన తోసి పుచ్చారు. ఇప్పటి వరకు సర్ పూర్తయిన తమిళనాడు, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఇక్కడి కంటే ఎక్కువ మిగితా 2వ పేజీలో

# నిషేధిత భూముల పరిష్కారానికి
## ఉన్నతస్థాయి కమిటీ!

**పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరిస్తాం: రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజలకు క్షమాపణలు.. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788 ఏర్పాటు**




బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో 22(a) నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రిజిస్ట్రేషన్ అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ వారానికోసారి సమావేశమై పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.

**15 రోజుల్లోగా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం**

రాష్ట్రంలో 22(a) సమస్యలు ప్రధానంగా హైదరాబాద్, మల్కాజ్‌గిరి జిల్లాలోనే 511 దరఖాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పెండింగ్ దరఖాస్తులన్నింటినీ 15 రోజుల్లోగా, మిగిలిన జిల్లాల్లో ఉన్న దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను పెంచాలని సూచించారు.

**టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788 అందుబాటులోకి..**

నిషేధిత భూములపై సమాచారం మరియు ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నంబర్‌కు సమాచారం అందిస్తే కనీసం 3 రోజుల్లో స్పందించి పరిష్కార చర్యలు చేపడతారని స్పష్టం చేశారు. ఒకవేళ రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యపడని పక్షంలో దానికి గల స్పష్టమైన కారణాలను ప్రజలకు వివరించాలని, చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును నిబంధనల ప్రకారం తిరిగి వెనక్కి చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

**గత అధికారుల పొరపాట్లపై క్షమాపణలు**

గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించిన వివరాలను అధికారులు వదిలేయడం, జియో ట్యాగింగ్‌లో తప్పులు జరగడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పొరపాట్లకు గాను ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పిన మంత్రి పొంగులేటి, ఈ సమస్యల నుంచి ప్రజలను గట్టెక్కించే బాధ్యత తమ ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) జాబితాను సవరిస్తున్నామని, భూదాన్ భూములపై సమగ్ర నివేదిక రూపొందించి అసలైన హక్కుదారులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

# 22ఏ పేరుతో లక్షలాది ఆస్తులు నిషేధిత జాబితాలోకి

**ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**తక్షణమే తప్పులను సరిదిద్దాలి.. 22ఏలో చేర్చిన ఆస్తుల వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: హరీశ్‌రావు**




బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో 22ఏ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఏలో ఉందో.. ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన ఆస్తులను తక్షణమే పరిశీలించి తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారని తెలిపారు. తెలంగాణలో 2008లో అప్పటి ప్రభుత్వం సీలింగ్ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసిందని పేర్కొన్నారు. అప్పట్లో సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను ఇప్పుడు మళ్లీ సీలింగ్ చట్టం కింద 22ఏలో చేర్చడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు.

ప్రభుత్వ భూముల విషయంలోనూ అధికారుల తీరుపై హరీశ్‌రావు విమర్శలు చేశారు. ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి ప్రభుత్వ భూములను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారంటే అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందని అన్నారు.

**చలాన్లు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్లు నిలిపివేత**

హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్‌రావు ఆరోపించారు. శ్రీనగర్ కాలనీలోని సర్వే నంబర్లు 8, 9లో గత 20 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారి ఆస్తులను కూడా 22ఏలో చేర్చారని అన్నారు. 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ప్రజలు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు.

చాలామంది తమ ఆస్తి 22ఏలో ఉందన్న విషయం తెలియక రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు చెల్లిస్తున్నారని, చివర్లో ఆస్తి 22ఏలో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ నిలిపివేస్తున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం చెల్లించిన చలాన్ మొత్తాన్ని కూడా తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు.

గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎన్‌వోసీలు పొందిన భూములకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు అదే భూములను 22ఏలో చేర్చడంతో ప్రజలతో పాటు బ్యాంకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ వంటి ప్రాంతాలను సైతం నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు.

22ఏ నిబంధనను ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టే సాధనంగా మార్చిందని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో 22ఏ నుంచి భూములను తొలగించేందుకు కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ను కొనసాగిస్తాం

**హైకోర్టు స్టే ఎత్తివేతకు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్**




బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథాతథంగా కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ పథకాలపై హైకోర్టు విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేయించేందుకు త్వరలోనే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. పేదలకు ఎలాంటి నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుందని చెప్పారు.

**సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించి గతంలో జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ దాఖలైన డబ్ల్యూ.పీ. నంబర్ 21732/2026పై హైకోర్టు ఈ నెల 12న విచారణ జరిపింది. ఈ పథకాలపై సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే విధించింది. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే.. పథకాల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత, ప్రజా ప్రయోజనాన్ని వివరిస్తూ సమగ్ర కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశామని మంత్రి తెలిపారు.

**గత ప్రభుత్వ ఉత్తర్వుల వల్లే చిక్కులు**

2014లో పథకాలను ప్రారంభించిన సమయంలో అప్పటి ప్రభుత్వం సరైన నిబంధనలతో జీవోలు జారీ చేయకపోవడం వల్లే ప్రస్తుతం న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలను పర్యవేక్షించే అధికారుల లోపమా.. లేక విభాగాధిపతుల అలసత్వమా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని చెప్పారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**'గ్రీన్ ఛానెల్' ద్వారా నిధుల విడుదల**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ఎలాంటి జాప్యం లేకుండా 'గ్రీన్ ఛానెల్' ద్వారా నిధులను నేరుగా విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమనే కారణంతో నిర్లక్ష్యం చేయకుండా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్‌పై మంత్రి మండిపాటు**

హైకోర్టు స్టే అంశాన్ని బీఆర్ఎస్ నేతలు రాజకీయంగా వాడుకుంటున్నారని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. పేదల సంక్షేమంపై మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతమందికి ఇళ్లు ఇచ్చారు.. ఎంతమందికి ఉపాధి కల్పించారనే అంశంపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

# విద్యార్థుల డిమాండ్లకు జార్ఖండ్ ప్రభుత్వం అంగీకారం

**జేఎస్ఎస్సీ–సీజీఎల్‌తో పాటు టీడీపీఎల్ నిర్వహించిన అన్ని పరీక్షలు రద్దు**

**2014 నుంచి జరిగిన నియామక పరీక్షల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు: సీఎం హేమంత్ సోరెన్**



బలగం టీవీ, హైదరాబాద్

నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్లకు జార్ఖండ్ ప్రభుత్వం అంగీకరించింది. జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షతో పాటు ప్రైవేటు సంస్థ టీడీపీఎల్ నిర్వహించిన అన్ని నియామక మిగితా 2వ పేజీలో

# ఉగ్ర కుట్రకు భారీ చెక్

**ఎస్‌బీఎన్ నెట్‌వర్క్ భగ్నం..**

**దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది అరెస్టు**

**పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు..**

**ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టల్స్ స్వాధీనం: అమిత్ షా**

బలగం టీవీ, హైదరాబాద్

దేశంలో భారీ కుట్రకు ప్రణాళిక రూపొందిస్తున్న ఉగ్ర నెట్‌వర్క్‌ను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. **షాహజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్)**కు చెందిన దాదాపు 200 మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు వివిధ కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థలు సమన్వయంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు.

**ఆగస్టు 15న ఏకకాలంలో దాడులు**

ఎస్‌బీఎన్ పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ ఐఎస్ఐకి అనుకూలంగా పనిచేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు అమిత్ షా తెలిపారు. ఈ నెట్‌వర్క్‌లో సుమారు 200 మంది సభ్యులు ఉన్నారని, దేశంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, రక్షణ సంస్థలకు మిగితా 2వ పేజీలో

# కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు–లారీ ఢీ

**25 మందికి గాయాలు..**

**ఐదుగురు చిన్నారులు**

**బస్సులో 60 మందికి పైగా ప్రయాణికులు..**

**కిలోమీటరు మేర ట్రాఫిక్‌జామ్**



వివరాలు 2వ పేజీలో

# అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలకు ట్రంప్ కోత

### కిమ్‌తో వ్యక్తిగత సంబంధాలను ప్రస్తావించిన అమెరికా అధ్యక్షుడు
### ఉత్తర కొరియాతో మళ్లీ చర్చలకు అవకాశం: సియోల్ ఆశాభావం

బలగం టీవీ, హైదరాబాద్

దక్షిణ కొరియాతో అమెరికా నిర్వహించే వార్షిక సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో తనకున్న వ్యక్తిగత సంబంధాలను ప్రస్తావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికా-ఉత్తర కొరియా మధ్య మళ్లీ చర్చలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని దక్షిణ కొరియా ఆశాభావం వ్యక్తం చేసింది.

దౌత్యానికి అవకాశం

ట్రంప్, కిమ్ మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలు అమెరికా-ఉత్తర కొరియా మధ్య అర్థవంతమైన చర్చలకు దారితీయాలని సియోల్ అధ్యక్ష కార్యాలయం ఆకాంక్షించింది. కొరియా ద్వీపకల్పంలో శాంతి, స్థిరత్వం కోసం అవసరమైన దౌత్య ప్రయత్నాలను కొనసాగిస్తామని తెలిపింది.

అమెరికా, దక్షిణ కొరియా సైనిక సన్నద్ధత, సంయుక్త విన్యాసాలకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు స్వేచ్ఛ కల్పించే అంశంపైనా ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

షెడ్యూల్ ప్రకారమే విన్యాసాలు

అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉల్చి ఫ్రీడమ్ షీల్డ్ సైనిక విన్యాసాలు సోమవారం షెడ్యూల్ ప్రకారమే ప్రారంభమయ్యాయి. మొత్తం 11 రోజుల పాటు ఈ విన్యాసాలు కొనసాగనున్నాయి. అయితే ట్రంప్ ఆదేశాల నేపథ్యంలో ఏయే శిక్షణ కార్యక్రమాలను తగ్గిస్తారనే అంశంపై వెంటనే స్పష్టత రాలేదు.

ఈ ఏడాది దాదాపు 18 వేల మంది దక్షిణ కొరియా సైనికులు ఈ విన్యాసాల్లో పాల్గొననున్నట్లు గతంలో ఆ దేశ సైన్యం వెల్లడించింది.

ఉత్తర కొరియా తీవ్ర వ్యతిరేకత

అమెరికా-దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ డ్రిల్స్‌ను తమపై దాడికి సన్నాహకాలుగా ప్యాంగ్యాంగ్ అభివర్ణిస్తూ వస్తోంది. దీంతో



ట్రంప్ తాజా నిర్ణయం సియోల్‌లో భద్రతాపరమైన ఆందోళనలకు కూడా కారణమైంది.

సైనిక విన్యాసాలను తగ్గించాలని తీసుకున్న నిర్ణయాన్ని ట్రంప్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ఈ విన్యాసాలు భారీగా ఖర్చుతో కూడుకున్నవని, ఉత్తర కొరియాకు అనవసరమైన శత్రుత్వ సంకేతాలను పంపుతున్నాయని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీకాలంలో ఉత్తర కొరియా నుంచి పెద్దగా బెదిరింపులు ఎదురుకాలేదని తెలిపారు.

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌కు విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని ఆదేశించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇటీవల ఇరాన్‌కు సంబంధించిన సైనిక చర్యల్లో అమెరికాకు మద్దతు ఇవ్వాలని దక్షిణ కొరియాను కోరగా, సియోల్ నిరాకరించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

2019 తర్వాత దూరమైన కిమ్

2019లో ట్రంప్, కిమ్ మధ్య జరిగిన శిఖరాగ్ర చర్చలు విఫలమైన తర్వాత ఉత్తర కొరియా అమెరికా, దక్షిణ కొరియాలతో దాదాపుగా చర్చలకు దూరంగా ఉంది. అదే సమయంలో అణ్వాయుధాలు, క్షిపణి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది.

అణు పదార్థాల ఉత్పత్తిని పెంచడంతో పాటు రష్యాతో సంబంధాలను బలోపేతం చేసుకుంది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో మాస్కోతో సైనిక సహకారాన్ని పెంచుకున్న ప్యాంగ్యాంగ్.. చైనాతోనూ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేసింది.

ఉత్తర కొరియాతో సంబంధాల కోసం సియోల్ చర్యలు

దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపర్చేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టారు. సరిహద్దుల్లో ఉత్తర కొరియాను ఉద్దేశించి నిర్వహించే లౌడ్‌స్పీకర్ ప్రసారాలను నిలిపివేశారు. కే-పాప్ పాటలు, అంతర్జాతీయ వార్తలను ప్రసారం చేసే ఈ విధానంపై ప్యాంగ్యాంగ్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసేది.

అలాగే ఉత్తర కొరియాలోకి బెలూన్ల ద్వారా ప్రచార కరపత్రాలను పంపే కార్యకర్తలపై కూడా ఆంక్షలు విధించారు. తాజాగా 1950-53 కొరియా యుద్ధాన్ని అధికారికంగా ముగించే దిశగా చర్చలు జరపాలని అధ్యక్షుడు లీ ప్రతిపాదించారు. ఆ యుద్ధం కాల్పుల విరమణ ఒప్పందంతో ముగిసినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఇప్పటివరకు శాంతి ఒప్పందం కుదరలేదు.

# హర్మూజ్ విషయంలో ఒమన్‌కు ట్రంప్ వార్నింగ్

### ఇరాన్‌తో కలిసి అడుగులు వేస్తే బాంబుల వర్షం కురిపిస్తాం
### ఇరాన్ లొంగిపోవాలి.. జల దిగ్బంధనం కొనసాగుతుంది: ట్రంప్



బలగం టీవీ, హైదరాబాద్

పశ్చిమాసియాలో వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధి నియంత్రణ విషయంలో ఇరాన్‌తో కలిసి అడుగులు వేయవద్దని ఒమన్‌ను హెచ్చరించారు. అమెరికా వైఖరికి విరుద్ధంగా ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు.

ఫాక్స్ న్యూస్ ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్ పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. జూన్‌లో కుదిరిన 60 రోజుల అవగాహన ఒప్పందం గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

ఇరాన్ లొంగిపోవాలి

పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించాలంటే ఇరాన్ వెంటనే తెల్లజెండా ఎగరేసి లొంగిపోవాలని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అయితే ఇందుకు నిర్దిష్ట గడువు ఏదీ విధించలేదన్నారు. ''ఈ విషయంలో నేనేమీ తొందరపడటం లేదు'' అని వ్యాఖ్యానించారు.

ఇరాన్ ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు అమెరికా నౌకాదళం అమలు చేస్తున్న జల దిగ్బంధనం కొనసాగుతుందని తెలిపారు. ఇరాన్ నాయకులు మంచి పోకర్ ఆటగాళ్లని, అయితే అమెరికా నావికాదళ దిగ్బంధనం కారణంగా ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. నవంబర్‌లో జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలకు తన నిర్ణయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఆయుధ నిల్వలపై స్పష్టత

పశ్చిమాసియాలో అమెరికా ఆయుధ నిల్వలు తగ్గిపోయాయన్న వార్తలను ట్రంప్ తోసిపుచ్చారు. తమ మొత్తం ఆయుధ నిల్వల్లో ఇప్పటివరకు ఉపయోగించింది చాలా తక్కువేనని చెప్పారు. అయితే మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో ఉక్రెయిన్‌కు వైమానిక రక్షణ వ్యవస్థలతో పాటు పలు అధునాతన ఆయుధాలను అందించడం వల్ల కొన్ని ఆధునిక ఆయుధ వ్యవస్థల్లో కొంత కొరత ఏర్పడిందని వివరించారు.

అయినప్పటికీ అమెరికా వద్ద ప్రస్తుతం తగినంత ఆయుధ సంపత్తి ఉందని ట్రంప్ పేర్కొన్నారు.

ఇరాన్-ఒమన్ చర్చలపై ఆగ్రహం

హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలకు పూర్తి భద్రత కల్పించే అంశంపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు కొనసాగుతుండటమే ట్రంప్ ఆగ్రహానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. వారాలుగా జరుగుతున్న చర్చల అనంతరం రెండు దేశాలు సంయుక్త నౌకాయాన మార్గదర్శక పటాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం.

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం హర్మూజ్ జలసంధిలో సురక్షితమైన కొత్త నావిగేషన్ విధానాన్ని రూపొందించే బాధ్యతను ఇరాన్, ఒమన్‌లకు అప్పగించడంతో ఈ చర్చలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామం తమ ప్రయోజనాలకు విరుద్ధంగా మారుతుందనే ఆందోళనతోనే ఒమన్‌ను ట్రంప్ హెచ్చరిస్తున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.

చర్చలు కొనసాగుతాయి: ఇరాన్

ఇరాన్-ఒమన్ చర్చలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పందించారు. హర్మూజ్ జలసంధిలో అశాంతి, అనిశ్చితికి అమెరికా చేపడుతున్న సైనిక చర్యలే ప్రధాన కారణమని ఆరోపించారు. తీరప్రాంత దేశాల సార్వభౌమాధికారాన్ని కాపాడుతూనే వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణానికి మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

ఆలస్యానికి మూడు కారణాలు

ఇరాన్-ఒమన్ చర్చలు కొలిక్కి రావడానికి కొంత సమయం పడుతోందని బఘాయీ చెప్పారు. ఇందుకు మూడు ప్రధాన కారణాలను ఆయన వివరించారు.

అంశం అత్యంత సంక్లిష్టంగా ఉండటం.

అనేక వర్గాలు, భాగస్వామ్య దేశాలు ప్రక్రియపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించడం.

ప్రాంతీయ శాంతిని కోరుకోని కొన్ని విద్రోహ శక్తులు చర్చలను అడ్డుకునేందుకు కుట్రలు చేయడం.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇరాన్, ఒమన్ తమ ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం చర్చలు కొనసాగిస్తున్నాయని బఘాయీ తెలిపారు. త్వరలోనే ఇరు దేశాల తరఫున సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

# ఏడాదిన్నరలో నాలుగు ఆసుపత్రులు పూర్తి చేస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య, వైద్య శాఖకు గతంలో సగటున ఏటా రూ.13 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే, ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు రూ.21,800 కోట్ల నిధులను ఖర్చు చేసిందని తెలిపారు.

గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా

వందేళ్ల కిందట నిజాం ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని సీఎం అన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ఆసుపత్రిలోకి నీరు చేరే పరిస్థితి ఉందన్నారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోషామహల్‌లో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్లతో 200 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

ప్రభుత్వ వైద్యులు అదనపు సమయం పనిచేసి మరిన్ని శస్త్రచికిత్సలు నిర్వహించేలా ప్రోత్సాహకాలు అందించాలని సీఎం సూచించారు. వైద్యుల నైపుణ్యాన్ని ఇతర ప్రాంతాల్లో వినియోగించుకునే పరిస్థితి లేకుండా, అదనపు సేవలు, శస్త్రచికిత్సలకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని ఆదేశించారు.

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ అవకాశాలు

నర్సింగ్ రంగంలో పనిచేస్తున్న మహిళలు ప్రస్తుతం ప్రధానంగా మధ్యప్రాచ్య దేశాల్లో సేవలు అందిస్తున్నారని సీఎం తెలిపారు. భవిష్యత్తులో జర్మన్, జపనీస్, కొరియన్ భాషలను నేర్చుకుని ఆయా దేశాల్లో లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించి, ఆ తర్వాత అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తే ప్రజలు స్వయం సమృద్ధిగా జీవించగలరని అన్నారు. సరైన అవకాశాలు కల్పిస్తే ప్రజలు ప్రభుత్వం అందించే ఉచిత సంక్షేమ పథకాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.

సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరుతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించడం పేదలకు ఎంతో ప్రయోజనకరమని సీఎం తెలిపారు. గుండె, కిడ్నీలు, అవయవ మార్పిడి వంటి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా టిమ్స్ నిర్మాణం, ప్రారంభోత్సవానికి కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు.

# దర్యాప్తు త్వరగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

సహేతుకమైన సూచనలను పరిశీలించాలి

దర్యాప్తులో పారదర్శకత కోసం కేసులోని వివిధ పక్షాలు ఇచ్చే సహేతుకమైన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సిట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సిట్ సమర్పించే స్టేటస్ రిపోర్టును పరిశీలించిన అనంతరం భక్తులు సమర్పించే విరాళాల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడానికి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

జులైలోనే దర్యాప్తుపై ఆదేశాలు

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్ల నేపథ్యంలో జులై 13న సుప్రీంకోర్టు యూపీ పోలీసులను స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. అనంతరం జులై 20న విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటు చేసే అంశంపై తమకు సమాచారం ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది.

ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది.

నలుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో విరాళాల చోరీ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జులై 27న ఐజీపీ కిరణ్ ఎస్. నేతృత్వంలో నలుగురు సభ్యులతో సిట్‌ను ఏర్పాటు చేసింది.

దర్యాప్తులో భాగంగా ఒక ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా సిట్‌లో చేర్చాలని సుప్రీంకోర్టు గతంలోనే సూచించింది.

సీబీఐ దర్యాప్తు కోరిన పిటిషనర్లు

రామమందిర విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ సహా పలువురు పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆలయ ట్రస్టు ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడంతో పాటు సీబీఐ దర్యాప్తు జరిపించాలని వారు కోరారు.

రాజకీయంగా దుమారం

రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై కాంగ్రెస్ గతంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసింది. కేసులో నిందితులను ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బీజేపీ-ఆర్ఎస్ఎస్ యంత్రాంగం కాపాడుతోందని ఆరోపించింది. సిట్ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది.

విరాళాల నిధుల దుర్వినియోగం కోట్లాది మంది హిందువుల విశ్వాసంపై దాడి అని కాంగ్రెస్ పేర్కొంది.

ట్రస్టు కార్యదర్శి రాజీనామా

ఇదిలా ఉండగా, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. అయోధ్య రామమందిర నిర్వహణ కోసం ప్రత్యేకంగా సీఈఓను నియమించే ప్రక్రియను చేపట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో సీఈఓ నియామకం ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సర్' ముసాయిదా జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఓట్లు తొలగించారని గుర్తు చేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారమే ఓట్లను తొలగించామనీ, ఇందులో ఎవరి ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఎవరి ఓట్లయినా లేకపోతే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ముసాయిదా జాబితా సీడీలను అందజేసినట్టు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పరిశీలన, క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుగ్గా పాల్గొనాలని సుదర్శన్‌రెడ్డి కోరారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితమైనదిగా, పారదర్శకంగా రూపొందించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త ఓటుకు ఫారం 6....

అక్టోబర్ 1 నాటికి లేదా అంతకు ముందే 18 ఏండ్లు నిండిన యువ ఓటర్లతో పాటు ఓటు వివిధ కారణాల వల్ల ఓటు రాని వారు నిర్దేశిత డిక్లరేషన్‌తో కూడిన 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీలు కాని సందర్భంలో ఆన్‌లైన్ ద్వారా ఓటర్ నమోదు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. నివాసం మార్చినప్పటికీ తమ పాత నియోజకవర్గంలోనే నమోదై ఉన్న ఓటర్లు, చిరునామా మార్పు తర్వాత ఓటరు నమోదును వలస లేదా బదిలీ చేయడానికి ఉద్దేశించిన ఫారం 8ని ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక క్యాంపేన్‌కు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు.

రెండు దశల్లో అప్పీల్....

పూర్తి వివరాలు సమర్పించని ఓటర్ల విషయంలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు విచారణ చేస్తారని తెలిపారు. విచారణ సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అయినా జాబితాపై అభ్యంతరాలుంటే ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌వో) తీసుకున్న ఏ నిర్ణయంపైనైనా ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 24(a) ప్రకారం జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేయవచ్చన్నారు. మొదటి అప్పీల్ అధికారి నిర్ణయంపై 25 24(b) ప్రకారం రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1960లోని రూల్ 27 ప్రకారం ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో)కు రెండో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.

ఓటు తెలుసకోవడమేలా?

ముసాయిదా జాబితాలో తమ ఓటున్నదో లేదో తెలుసుకోవడనాకి ఈసీఐ అధికారిక వెబ్‌సైట్ https://www.eci.gov-.in/ను సందర్శించాలి. పైన ఉన్న SIR-2026 డౌన్‌లోడ్ ఎలక్ట్రోల్ రోల్ పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత వచ్చిన విండోలో తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ ఎంచుకోవాలి. తర్వాత మీ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, భాష సెలక్ట్ చేసుకోగానే కింద ఓటరు జాబితాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. అందులో మీ పార్ట్ నెంబర్, పేరును సెలక్ట్ చేసి పైన కనిపించే క్యాప్చాకోడ్‌ను ఎంటర్ చేసి డౌన్‌లోడ్‌పై క్లిక్ చేయగానే.. మీ ఓటరు జాబితా పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ అవుతుంది. అందులో మీ సీరియల్ నంబర్‌తో లేదా మీ పేరు, ఎపిక్ నంబర్‌లతో చెక్ చేసుకోవచ్చు.

తొలగించిన వారి వివరాలు...

1). మరణించిన వారు 9,22,230
2). శాశ్వతంగా వలస వెళ్లిన వారు 45,18,961
3). ఆచూకీ లభించని ఓటర్లు 11,25,546,
4). ఇప్పటికే ఎన్‌రోల్ అయిన ఓటర్లు 6,70,203
5) ఇతరులు 1,02,294

మొత్తం తొలగించిన ఓట్లు 73,39,234

# విద్యార్థుల డిమాండ్లకు జార్ఖండ్ ప్రభుత్వం అంగీకారం

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు.

సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సుదీర్ఘ కేబినెట్ సమావేశం అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. విద్యార్థుల ఆందోళన 24వ రోజుకు చేరిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కొందరు విద్యార్థులు గత 14 రోజులుగా నిరాహార దీక్ష కూడా చేస్తున్నారు.

2014 నుంచి అన్ని పరీక్షలపై విచారణ

నియామక పరీక్షల్లో అవకతవకలపై రాష్ట్ర నేర పరిశోధనా విభాగం, ప్రత్యేక దర్యాప్తు బృందం చేపట్టిన విచారణలో ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని హేమంత్ సోరెన్ తెలిపారు. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన అన్ని నియామక పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయా అనే అంశంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీఐడీని ఆదేశించినట్లు వెల్లడించారు.

1,800 మంది నియామకాలపై ప్రభావం

2024లో జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షలో సుమారు 1,800 మంది అభ్యర్థులు ఇప్పటికే అర్హత సాధించి రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. ఈ పరీక్ష కూడా టీడీపీఎల్ వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తు పరిధిలోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

టీడీపీఎల్ సంస్థ 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షతో పాటు రెండు సివిల్ సర్వీసెస్ బ్యాక్‌లాగ్ పరీక్షలను కూడా నిర్వహించింది.

ఇప్పటికే 21 మంది అరెస్టు

ఈ ఏడాది నిర్వహించిన 14వ జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై జూలై 22న సీఐడీ కేసు నమోదు చేసింది. ఇప్పటివరకు మాజీ జేపీఎస్‌సీ చైర్మన్ ఎల్. ఖియాంగ్టేతో పాటు టీడీపీఎల్‌కు చెందిన డైరెక్టర్లు, అధికారులు, మధ్యవర్తులు కలిపి 21 మందిని అరెస్టు చేసినట్లు సమాచారం.

ఈ దర్యాప్తులో బయటపడిన అంశాల ఆధారంగా టీడీపీఎల్ వ్యవహారం జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షకు కూడా విస్తరించినట్లు అధికారులు గుర్తించారు.

24 రోజులుగా విద్యార్థుల ఆందోళన

నియామక పరీక్షల్లో అక్రమాలకు నిరసనగా ఉద్యోగార్థులు రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో ధర్నా చేపట్టారు. కొందరు నిరాహార దీక్షకు దిగారు. ఆగస్టు 10న విద్యార్థులు అసెంబ్లీ వైపు ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆగస్టు 20న ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

టీడీపీఎల్ నిర్వహించిన అన్ని పరీక్షలు, జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్ష రద్దు చేయాలన్న రెండు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించింది. అయితే పరీక్షలపై సీబీఐ విచారణ జరపాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

పరీక్షల విధానంలో సంస్కరణలు

నియామక పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పరీక్షల ప్రక్రియను సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎలాంటి అక్రమాలకు అవకాశం

# కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు—లారీ ఢీ

బలగం టీవీ, హైదరాబాద్

జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో 25 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

వరంగల్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొండగట్టు సమీపంలో లారీని ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఢీకొన్న ధాటికి బస్సు డ్రైవర్ మురళి క్యాబిన్‌లో చిక్కుకున్నారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి ఆయనను బయటకు తీశారు. గాయపడిన వారితో పాటు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

కిలోమీటరు మేర ట్రాఫిక్‌జామ్

ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మల్యాల సీఐ రాజ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులతో కిక్కిరిసిన ఆస్పత్రి

ప్రమాదంలో పలువురు గాయపడిన విషయం తెలియడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణం క్షతగాత్రుల బంధువులతో కిక్కిరిసింది. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులు క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు.

ఘటనపై మంత్రి పొన్నం ఆరా

కొండగట్టు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జగిత్యాల కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

# ఉగ్ర కుట్రకు భారీ చెక్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ప్రదేశాలు, మతపరమైన ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు వెల్లడించారు.

నిఘా కోసం పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కుట్రను భారత నిఘా విభాగం, భద్రతా బలగాలు ముందుగానే ఛేదించాయని చెప్పారు.

భారీగా ఆయుధాలు స్వాధీనం

ఆగస్టు 15న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సమన్వయంతో నిర్వహించిన దాడుల్లో నెట్‌వర్క్‌కు చెందిన పలువురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టల్స్, లైవ్ క్యాట్రిడ్జ్‌లు, సీసీటీవీ కెమెరాలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కొన్ని వస్తువులపై పాకిస్థాన్ మార్కింగ్ ఉన్నట్లు గుర్తించినట్లు కేంద్ర హోం మంత్రి తెలిపారు.

80కి పైగా ఎఫ్ఐఆర్‌లు

ఈ నెట్‌వర్క్ సభ్యులు పలు ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అమిత్ షా పేర్కొన్నారు. అరెస్టయిన వారిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)తో పాటు ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఢిల్లీ, కర్ణాటకల్లో నమోదైన కేసులకు సంబంధించి దాదాపు 80 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు వెల్లడించారు.

ఏ రాష్ట్రంలో ఎంతమంది?

ఉత్తరప్రదేశ్: 62 మంది
ఢిల్లీ: 51 మంది
పంజాబ్: 44 మంది
రాజస్థాన్: 15 మంది
మహారాష్ట్ర: 8 మంది
ఉత్తరాఖండ్: 5 మంది
కర్ణాటక: 3 మంది
బిహార్: 3 మంది
గుజరాత్: 3 మంది
తెలంగాణ: 2 మంది
హిమాచల్‌ప్రదేశ్: 2 మంది
జమ్మూకశ్మీర్: 2 మంది
కేరళ: 2 మంది

ఉగ్రవాదాన్ని సహించేది లేదు

మోదీ ప్రభుత్వం దేశంలో ఉగ్ర నెట్‌వర్క్‌లను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుదిట్టంగా పనిచేస్తోందని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం సహించబోమని, దేశ భద్రతకు ముప్పుగా పరిణమించే ఎలాంటి కుట్రనైనా భద్రతా సంస్థలు సమర్థంగా అడ్డుకుంటాయని స్పష్టం చేశారు.

# ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం చేయాలి..

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**- ఐడీఓసీ నుంచి ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీ ప్రారంభం..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎయిడ్స్ నియంత్రణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ నుంచి నిర్వహించిన ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీని కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం టోల్‌ఫ్రీ నంబర్ 1097, క్యూఆర్ కోడ్తో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ర్యాలీ ఐడీఓసీ నుంచి ప్రారంభమై కొత్త బస్‌స్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా మానేరు వంతెన వరకు కొనసాగి, తిరిగి ఐడీఓసీకి చేరుకుని ముగిసింది. ఈ అవగాహన కార్యక్రమాలు ఆగస్టు 12న ప్రారంభమై 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు,




వైద్యం, మందులు, కౌన్సెలింగ్ వంటి సేవలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పాజిటివ్ కేసులు గుర్తించిన ప్రాంతాల్లో పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు అవగాహన సమావేశాలు, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణి మొత్తం 136 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 02 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 07 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించార. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 11, చందుర్తి మండలం 02, ఇల్లంతకుంట మండలం 07, గంభీరావుపేట మండలం 07, కోనరావుపేట మండలం 15, ముస్తాబాద్ 18, రుద్రంగి మండలం 0, తంగళ్లపల్లి మండలం 20, వీర్నపల్లి మండలం 08, వేములవాడ అర్బన్ మండలం 07, వేములవాడ రూరల్ మండలం 05, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 07 చొప్పున వచ్చాయి.

మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఈ ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి..




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లా: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగించాలని మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ తుల ఉమా అన్నారు . సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ఎదుట కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలని బీఆర్ ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ తుల ఉమా మాట్లాడుతూ పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. కుమార్తెల వివాహాల సమయంలో పేద కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషించాయని అన్నారు.ప్రస్తుతం పెరుగుతున్న వివాహ ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో పేద కుటుంబాలు ఈ పథకాలపై ఆధారపడుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారాన్ని కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందించాలని డిమాండ్ చేశారు.

# అర్హులైన పవర్లూమ్ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి..



**- చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా..**

బలగం టీవీ, సిరిసిల్ల:

అర్హత ఉన్న ప్రతి పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికుడికి చేనేత జౌళి శాఖ గుర్తింపు కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో పవర్లూమ్, అనుబంధ రంగాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. అర్హత ఉన్నప్పటికీ పలువురు పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికులకు ఇప్పటివరకు చేనేత శాఖ గుర్తింపు కార్డులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రయోజనాలకు తాము దూరమవుతున్నామని తెలిపారు.

అర్హులైన ప్రతి కార్మికుడిని గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా చేనేత శాఖ గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పవర్లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికుల ఆందోళనకు ఏఐఎస్టీయూ సంఘీభావం ప్రకటించింది. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ..

**-ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులకు ఎస్పీ ఆదేశం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ ఆఫీస్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 21 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్పీ, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.ఫిర్యాదులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనివల్ల పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతుందన్నారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం..
## పక్షవాత బాధిత కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ చేయూత..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

మానవత్వంతో స్పందించి ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళీమోహన్ గౌడ్. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన ఎం.డి. సమీర్ పక్షవాతంతో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మంగోలి శ్రీనివాస్ గౌడ్ ద్వారా అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళీమోహన్ గౌడ్ దృష్టికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన ఆకుల మురళీమోహన్ గౌడ్.. తన వంతు సహాయంగా సమీర్ కుటుంబానికి 50 కిలోల నాణ్యమైన బియ్యంతో పాటు కొద్దిరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న ఆయన సేవాభావాన్ని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హృదయపూర్వకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఆకుల మురళీమోహన్ గౌడ్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగోలి శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాస్ గౌడ్, కే. స్వామి, సర్పంచ్ ముత్యాల ప్రమీల, బాలరాజ్, మాజీ ఎంపీటీసీ సింగారపు మధు, జి. శ్రీకాంత్ గౌడ్, ఎం. శ్రీనివాస్ గౌడ్, జి. దేవరాజ్ గౌడ్, వాసరవేణి దేవరాజు, ఇందూరి కిషన్, ఘనగోని నాగరాజు గౌడ్, ఇమ్మడి రామచంద్రం, షేక్ ఉస్మాన్, ఘనగోనిబంటి గౌడ్, నాగపురి నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కుటుంబ సభ్యులను పరామర్శించిన సుద్దాల దేవయ్య.

బలగం టీవీ, గంగాధర:

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామంలో ఇటీవల కాలంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్ తల్లి మృతి పట్ల వారి స్వగృహంలో కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఆదివారం రోజున పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల బిజెపి శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్, గ్రామ శాఖ బిజెపి అధ్యక్షులు దాసరి రాజు, లక్ష్మణ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో తప్పనిసరిగా పెట్టాలి..

**-బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్**

బలగం టీవీ, బోయినిపల్లి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేయనున్న స్మార్ట్ రేషన్ కార్డులో కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో మాత్రమే కాకుండా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను కూడా తప్పనిసరిగా ముద్రించాలని భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల శాఖ డిమాండ్ చేసింది.



దేశవ్యాప్తంగా అమలవుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వమే కీలక పాత్ర పోషిస్తూ, ఆహార ధాన్యాల సరఫరా మరియు సబ్సిడీ ద్వారా రాష్ట్రాలకు, ప్రజలకు భారీగా సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు అందుతున్న రేషన్‌లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం అత్యంత కీలకమైనది. అందువల్ల స్మార్ట్ రేషన్ కార్డుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోతో పాటు, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ప్రతిబింబించేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను కూడా సముచితంగా ముద్రించాలని బీజేపీ బోయినిపల్లి మండల శాఖ డిమాండ్ చేసింది.

ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ఆహార భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వ బాధ్యత. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా సంక్షేమ పథకాలను వ్యక్తిగత ప్రచార వేదికలుగా మార్చకూడదు. స్మార్ట్ రేషన్ కార్డులో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను చేర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాము. లేనిపక్షంలో బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ . 87.69 శాతం నమోదు పూర్తి

### అనామలీస్ జాబితాలో 78,835 మంది ఓటర్లు

### లోపాలు, డబుల్ ఓట్లున్న వారికి నోటీసులు

### అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా

బలగం టీవీ, సిరిసిల్ల

జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఎన్యూమరేషన్ నమోదు గడువును రెండుసార్లు పొడిగించడంతో జిల్లాలో 87.69 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. మొత్తం 4,75,694 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేయగా, 4,17,127 మంది వివరాల డిజిటలైజేషన్ పూర్తయింది.

జిల్లాలో 58,567 మంది ఓటర్లకు సంబంధించిన వివరాలు గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 12,791 మంది మృతి చెందినవారు కాగా, 9,098 మంది ఓటర్ల చిరునామాలు లభించలేదు. మరో 25,926 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించారు. 690 మంది ఇతర కేటగిరీలో ఉండగా, ఇప్పటికే ఓటర్లుగా నమోదైన డూప్లికేట్ ఓట్లు 10,062 ఉన్నట్లు గుర్తించారు.

5,006 మంది ఓటర్లకు నో మ్యాపింగ్

జిల్లాలో 5,006 మంది ఓటర్లకు నో మ్యాపింగ్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేసి, 2002 ఓటర్ల జాబితాతో పోల్చుతూ సవరణ ప్రక్రియ చేపట్టారు.

అనామలీస్ జాబితాలో 78,835 మంది

ఓటర్ల జాబితాలో అక్షర దోషాలు, పేర్ల నమోదులో తప్పులు, ఇతర లోపాలు ఉన్నవారిని అనామలీస్ జాబితాలో చేర్చారు. ఈ జాబితాలో మొత్తం 78,835 మంది ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 48,963 మంది, వేములవాడ నియోజకవర్గంలో 29,872 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్యూమరేషన్ వివరాల డిజిటలైజేషన్ పూర్తయినప్పటికీ, ఆన్‌లైన్‌లో నమోదైన పొరపాట్లను ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఓటుహక్కు కలిగిన వారి వివరాలను 2002 ఓటర్ల జాబితాతో పరిశీలిస్తున్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారికి నోటీసులు జారీ చేసి, వారి వివరాలను సవరించనున్నారు.

అక్టోబర్ 19న తుది జాబితా

ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గరీమా అగ్రవాల్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అనుమానాలను నివృత్తి చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.

సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 15లోగా వాటిని పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు.

వివరాలు ఇలా..

జిల్లాలో మొత్తం ఓటర్లు: 4,75,694
ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ: 4,75,694
డిజిటలైజేషన్ పూర్తయినవి: 4,17,127
సిరిసిల్ల నియోజకవర్గం డిజిటలైజేషన్: 2,14,804
వేములవాడ నియోజకవర్గం డిజిటలైజేషన్: 2,02,323
మరణించిన ఓటర్లు: 12,791
శాశ్వతంగా తరలివెళ్లిన వారు: 25,926
డూప్లికేట్ ఓట్లు: 10,062
చిరునామాలు లభించని వారు: 9,098
నో మ్యాపింగ్ ఓటర్లు: 5,006
అనామలీస్ జాబితాలో: 78,835



## 11వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలించిన వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు .

బలగం టీవీ, వేములవాడ:

వేములవాడ పట్టణంలోని 11వ వార్డ్ లో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ వెంగల అనిత శ్రీకాంత్ తో కలిసి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు, పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే స్థానికంగా వర్షపు నీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు.

## మొక్క నాటిన నూతన వధూవరులు..



బలగం టీవీ, బోయినిపల్లి:

తమ పెళ్లి సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామంలో మొక్క నాటిన పొన్నం రేణుక పర్శరాములు కుమార్తె నూతన వధూవరులు పొన్నం స్వాతిక సాయితేజ గౌడ్. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని పెళ్లి సందర్భంగా మొక్క నాటిన నూతన వధూవరులు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేది:16-09-2026 రోజు మా పెళ్లి సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా మొక్క నాటమణి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంచి కార్యక్రమాన్ని చేపట్టి ప్రముఖులతో మొక్కలు నాటిస్తూ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అద్భుతంగా నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ పర్యావరణనికి తోడ్పడాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు కన్నం సాగర్ మరియు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణకుమార్ మృతి తీరని లోటు: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్!

### మనోచైతన్య నిర్వాహకుడి భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించిన బిఆర్ఎస్ నేతలు

### మానసిక దివ్యాంగులకు ఉపాధి కల్పించిన ఆదర్శప్రాయుడని కొనియాడటం

బలగం టీవీ, గోదావరిఖని

గోదావరిఖని గాంధీనగర్‌లోని మనోచైతన్య మానసిక వికలాంగుల వృత్తి శిక్షణా ఉపాధి కేంద్రం నిర్వాహకుడు డీ. కృష్ణకుమార్ మృతి చెందడం పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కృష్ణకుమార్ సోమవారం తుది శ్వాస విడిచారు.

మృతదేహానికి అంజలి.. కుటుంబానికి పరామర్శ

కృష్ణకుమార్ మరణవార్త తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు శారదనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిరస్మరణీయ సేవలు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బుద్ధిమాంద్యంతో పుట్టి విధివంచితులైన పారిశ్రామిక ప్రాంతంలోని ఎంతోమంది మానసిక దివ్యాంగులను చేరదీసి, వారితో వివిధ రకాల స్టేషనరీ వస్తువులను తయారు చేయించి స్వయం ఉపాధి కల్పించడంలో కృష్ణకుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మానసిక దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన ఆదర్శప్రాయుడని, ఆయన అకాల మరణం తీరని లోటని పేర్కొన్నారు.

కృష్ణకుమార్ మృతి పట్ల పలు రాజకీయ పక్షాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ఆశ్రమాల నిర్వాహకులు తీవ్ర సంతాపం తెలిపారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పరిరక్షణకు బీఆర్ఎస్ మహిళా నాయకుల నిరసన..

### తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ – తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ



బలగం టీవీ, వేములవాడ:

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు నిరసన చేపట్టారు.తెలంగాణ చౌక్‌లో నిరసన వ్యక్తం చేసిన అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం "ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే భావనకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూపం ఇచ్చిందని పేర్కొన్నారు.

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహం ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలిచిన ఈ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పథకాలను రద్దు చేయడం లేదా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు హామీలను అమలు చేస్తామని చెప్పి, ప్రస్తుతం వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. పేదింటి ఆడబిడ్డలకు అందాల్సిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ప్రయోజనాలను సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కళ్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని కౌన్సిలర్లు అన్నారు. హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందో సమాధానం చెప్పాలని అన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, వాసాల లావణ్య, వెంగల అనితతో పాటు మహిళా నాయకులు, పట్టణ సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను

# నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాలి



బీఆర్ఎస్ నేతలు..

బలగం టీవీ, ముస్తాబాద్:

పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలుస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు రాచమడుగు సంతోష్ రావు, రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్ ఆరోపించారు. సోమవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిందిపోయి పథకాలను నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం ఉందని విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు చారిత్రాత్మకమైనవని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామాల్లో పర్యటించిన కేసీఆర్, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించారని తెలిపారు. ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు బాల్యవివాహాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఈ పథకాలను రూపొందించారని వివరించారు. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు దాదాపు 13 లక్షల పేద కుటుంబాలు లబ్ధి పొందాయని వారు తెలిపారు. ఇలాంటి సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు గూడూరి భరత్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎండి. నవాజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు మిడిదొడ్డి యాదగిరి, కోడె శ్రీను, పల్లె సత్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా పింఛన్ల రద్దుకు కుట్ర చేస్తున్నారని ఆరోపణ



### నల్లబ్యాడ్జీలు ధరించి బీడీలు చుడుతూ బీఆర్ఎస్ నిరసన

### ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన నాయకులు

బలగం టీవీ, జ

అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదల సంక్షేమం భారంగా మారిందని జగిత్యాల జడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. ఆసరా పింఛన్ల పథకాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి బీడీలు చుడుతూ నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆడబిడ్డలంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎందుకింత అక్కసు అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ఎగనామం పెడుతూ ప్రభుత్వం పేద కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

కళ్యాణలక్ష్మి పథకానికి కోర్టు స్టే ఇచ్చినప్పటికీ ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం చేయడం వెనుక ఉన్న కారణాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు.

హామీల అమలులో విఫలం

తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించే పరిస్థితిలో కూడా లేదని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు వంటి పలు సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి రెండున్నరేళ్లు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఆడబిడ్డల హక్కులను హరించకుండా ప్రభుత్వం వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.